# కలిసి నడుద్దాం..

- మాజీ మంత్రి సింగిరెడ్డిని కలిసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



ప్రవీణ్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న సింగిరెడ్డి దంపతులు

వనపర్తి, మార్చి 12 (నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్–బీఎస్పీలు పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి నడవాలని నిర్ణయించిన క్రమంలో ఇద్దరి కలయికకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇటీవలే ప్రవీణ్‌కుమార్ మాజీ సీఎం కేసీఆర్‌ను కలవడం రెండు పార్టీలు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించిన సంగతి విధితమే. ఇందులో భాగంగా మాజీ మంత్రి సింగిరెడ్డిని కలిసి వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఇరుపార్టీల ఓట్లను సంపూర్ణంగా వినియోగించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నేతలు ఒక నిర్ణయానికి వచ్చారు. భావసారూప్యత ఉన్న పార్టీలు కలిసి పనిచేయడం వల్ల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని ఈ సందర్భంగా సింగిరెడ్డి, ప్రవీణ్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. అనతికాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, ఉన్నవాటికి కూడా కోత విధించడం వల్లే వ్యతిరేకత గూడుకట్టుకున్నదని అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి నడుద్దామని, కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుదామన్నారు. కాగా, ప్రవీణ్‌కుమార్ దంపతులను సింగిరెడ్డి దంపతులు సన్మానించారు.




హన్వాడ తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

# హాస్టల్‌లో మరుగుదొడ్లు నిర్మించాలి

- హన్వాడ తాసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థుల ధర్నా

హన్వాడ, మార్చి 12 : ఎస్సీ హాస్టల్‌లో మరుగుదొడ్లు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భరత్, కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు మాణిక్యంరాజు డిమాండ్ చేశారు. మంగళవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్‌లో దాదాపుగా 150 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. హాస్టల్‌లో మౌలిక సదుపాయలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణానికి రూ.6లక్షలు మంజూరైనా ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బాత్‌రూంలు లేకపోవడంతోపాటు ప్రహరీ లేక విషపురుగులు సంచరిస్తుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తాసీల్దార్ కిష్టానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తాసీల్దార్ డీడీ పాండుతో ఫోన్‌లో మాట్లాడగా నిధులు మంజూరయ్యాయని, నిర్మాణం చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని, త్వరలో మరుగుదొడ్లు నిర్మించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కొల్లాపూర్ పీజీ కళాశాల ఆవరణలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

# పీజీ హాస్టల్స్‌ను ప్రారంభించాలి

కొల్లాపూర్, మార్చి 12 : పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని కొల్లాపూర్ పీజీ కళాశాలలోని హాస్టల్స్‌ను వెంటనే ప్రారంభించాలని కోరుతూ ఆ కళాశాలలో విద్యార్థులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీయూ జేఏసీ చైర్మన్ బత్తిని రాము, బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు శేఖర్, స్వేరోస్ స్టూడెంట్ యూనియన్ నాయకుడు దాస్ మాట్లాడుతూ పీజీ కళాశాల ప్రారంభం నుంచి ఇప్పటివరకు హాస్టల్‌లో వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి అడ్మిషన్ పొంది ఉన్నత విద్యతో కూడిన పట్టాలు తీసుకుపోవాలని ఎన్నో ఆశలతో విద్యార్థులు ఇక్కడికి వచ్చారన్నారు. కానీ వారు నేడు అర్ధాకలితో అలమటిస్తున్నారని, మెస్ ప్రారంభం చేయకపోవడం మూలంగా రూమ్స్‌లో విద్యార్థులు వంట చేసుకొని తింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితి నుంచి మంత్రి జూపల్లి కృష్ణారావు విద్యార్థులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ, ఎస్ఎస్ యూ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మద్యం లిఫ్టింగ్ బంద్

- రెండు రోజులుగా గోదాంలోనే నిలిచిపోయిన మద్యం వాహనాలు

తిమ్మాజిపేట, మార్చి 12 : మద్యం వాహనాలకు సంబంధించి కొన్నాళ్లుగా వాణిజ్య పన్నులశాఖ, ఎక్సైజ్ శాఖల మధ్య నెలకొన్న 'ఈ–వే బిల్లుల' వివాదం చివరికి రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా చేసింది. డిపోల నుంచి మద్యం రవాణా వాహనాలు బయటకు రాగానే ఈవే బిల్లులు లేవంటూ వాహనాలను వాణిజ్య పన్నుల అధికారులు సీజ్ చేస్తుండడంతో రెండు రోజులుగా వైన్‌షాప్ ఓనర్లు మద్యం లిఫ్టింగ్ నిలిపివేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మద్యం దుకాణాలు, బార్ల ఓనర్లు ఎక్సైజ్‌శాఖ ఆధీనంలోని మద్యం డిపో నుంచి మద్యాన్ని లిఫ్టు చేస్తుంటారు. ఈ డిపోల నుంచి వ్యాన్లు, ఇతర పెద్ద వాహనాల ద్వారా తమ మద్యం దుకాణాల వరకు తీసుకెళ్తుంటారు. అయితే మద్యం రవాణా వాహనాలకు ఈవే బిల్లులు ఉండాల్సిందేనంటూ వాణిజ్య పన్నులశాఖ పట్టుబడుతుండగా, అవసరం లేదని ఎక్సైజ్‌శాఖ శనివారం నుంచి ఈ వ్యవహారం ఎటూ తేలకపోవడంతో ఎక్కిడికక్కడ వాణిజ్య పన్నుల శాఖాధికారులు మద్యం రవాణా వాహనాలను సీజ్ చేస్తున్నారు. మద్యంతో కూడిన వ్యాన్లను పోలీస్‌స్టేషన్లలో పెట్టేస్తున్నారు. దీంతో సోమ, మంగళవారం మద్యం దుకాణాల యజమానులు మద్యం తీసుకెళ్లడం నిలిపివేశారు. తిమ్మాజిపేట టీఎస్‌బీసీఎల్ స్టాక్‌పాయింట్ నుంచి మద్యం బయటకు వెళ్లలేదు. స్టాక్ తీసుకున్న వాహనాలను స్టాక్ పాయింట్ నుంచి బయటకు తేవడానికి భయపడుతున్నారు. మద్యం గోదాంల నుంచి ఇతర జిల్లాలో శనివారం మద్యాన్ని తీసుకెళ్తున్న వాహనాలను సీజ్ చేయడంతో విషయం రాష్ట్ర వ్యాప్తంగా పాకింది. దీంతో మద్యాన్ని తీసుకెళ్లేందుకు ఎవరూ సాహసించడం లేదు. దీంతో రెండు రోజులుగా మద్యం షాపుల్లో స్టాక్ అయిపోవడంతో మద్యం షాపుల యజమానులు ఎటూ తోచక తిమ్మాజిపేట మద్యం గోదాంకు వచ్చి వాహనాలను ఇక్కడే నిలిపివేశారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు మద్యాన్ని తీసుకెళ్లబోమని దుకాణ యజమానులు తెలిపారు. దీంతో తిమ్మాజిపేటలో మద్యాన్ని తీసుకెళ్లడానికి వచ్చిన వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

# ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్ల పరిశీలన


మహబూబ్‌నగర్, మార్చి 12 : మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసన మండలి ఉపఎన్నికల్లో అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులు పరిశీలించారు. 16 మంది 28 సెట్లు నామినేషన్లు వేయగా రిటర్నింగ్ అధికారి రవినాయక్, ఎన్నికల కమిషన్ పరిశీలకురాలు వాణిప్రసాద్ పరిశీలించారు. 13 మంది నామినేషన్లు ఆమోదించగా, ముగ్గురి పత్రాలను తిరస్కరించారు. అయితే, 14వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఉన్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

**పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి**

పార్లమెంట్ ఎన్నికలకు అని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కలెక్టర్లకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫిర్యాదులను పరిష్కరించి తప్పులు లేకుండా జాబితాను రూపొందించాలన్నారు. మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని 13వ తేదీ లోగా పంపించాలన్నారు. వీసీలో అధికారులు పాల్గొన్నారు.

# పాలమూరులో ఎమ్మెల్సీ వేడి

- స్థానిక సంస్థల ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్
- పోటీ నుంచి తప్పుకొన్న బీజేపీ
- విజయంపై గులాబీ శ్రేణుల ధీమా
- ఓటమి భయంతోనే పారిశ్రామికవేత్తకు 'హస్తం'
- ప్రజాప్రతినిధులను కొనుగోలు చేసే ప్రయత్నం
- సర్కారుకు షాక్ ఇస్తున్న స్థానిక నాయకులు
- అసెంబ్లీ ఎన్నికలను తలపిస్తున్న వైనం



మహబూబ్‌నగర్, మార్చి 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మహబూబ్‌నగర్‌లో శాసనమండలి ఉపఎన్నికల వేడి ప్రారంభమైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో స్థానిక ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికలను తలపిస్తున్నాయి. 2021లో బీఆర్ఎస్‌కు చెందిన కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం పార్టీ మారడం.. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఎమ్మెల్సీ పదవికి ఆయన రాజీనామా చేశారు. దీంతో ఉపఎన్నిక అనివార్యమైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు ఆ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులు అంతా ఇంకా బీఆర్ఎస్ వైపు ఉండడంతో కాంగ్రెస్‌కు ఓటమి భయం వెంటాడుతున్నది. నామినేషన్ల ఘట్టం ముగిసే సమయానికి బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రధాన పార్టీల అభ్యర్థులు బరిలో ఉన్నారు. మరో 14 మంది ఇండిపెండెంట్లు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం పోటీమాత్రం బీఆర్ఎస్ కాంగ్రెస్ మధ్యనే నెలకొన్నది. ఇదిలాఉండగా కాంగ్రెస్ పార్టీ ఓటమి భయంతో ఏకంగా ఓ పారిశ్రామికవేత్తను ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబెట్టింది. డబ్బులు ఇచ్చి స్థానిక ప్రజాప్రతినిధులను కొనుగోలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు జిల్లాలు వేరుపడడంతో రంగారెడ్డి జిల్లా వికారాబాద్ జిల్లాలో ఉన్న మండలాల ప్రజాప్రతినిధులు ఈ ఎన్నికల్లో పాల్గొంటున్నారు. మొత్తం ఉప ఎన్నికల్లో 1,439మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో ఇద్దరు ఎంపీలు ముగ్గురు ఎమ్మెల్సీలు, 14మంది ఎమ్మెల్యేలు కూడా ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కాగా స్థానిక ప్రజాప్రతినిధులకు కాంగ్రెస్ ఎరవేసినా ఎవరూ ఆ పార్టీ వైపు వెళ్లే పరిస్థితి లేదని గులాబీ దళం ధీమాతో ఉన్నది. గతంలో జెడ్పీ వైస్‌చైర్మన్‌గా పనిచేసిన నవీన్‌కుమార్‌రెడ్డిని బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీఫాం కూడా అందజేశారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు వెంటరాగా నవీన్‌కుమార్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి సవాల్ చేశారు. ఈ ఎన్నికల్లో తన విజయం ఖాయమని స్థానిక ప్రజాప్రతినిధులను ప్రలోభ పెట్టినా వినే పరిస్థితి లేదని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సిట్టింగ్ ఎంపీ, మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నాలు మొదలుపెట్టారు.

**నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపు పక్కా..**

మహబూబ్‌నగర్ శాసనమండలి ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి ఘన విజయం సాధించడం ఖాయమని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన 'నమస్తే తెలంగాణ' ప్రతినిధితో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ స్థానిక సంస్థల్లో ఇంకా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కొనసాగుతున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చి ఎన్ని ప్రలోభాలు పెట్టినప్పటికీ తమ పార్టీ నేతలు ఎవరూ కాంగ్రెస్‌లోకి పోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో డబ్బులతో గెలిచేందుకు పావులు కదుపుతుందని, అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు ఒక చెంపపెట్టు లాగా మారబోతున్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత వచ్చిన తొలి ఎన్నికల్లో గులాబీ పార్టీ గెలిచి కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తామన్నారు. కొంతమంది వెన్నుపోటు దారులు పార్టీకి నష్టం చేసినా కిందిస్థాయి కార్యకర్తలు ఇంకా పార్టీని నమ్ముకొని ఉన్నారని.. ఈ ఎమ్మెల్సీ ఎన్నిక గెలుపుతో నైతిక మద్దతు ఇస్తుందన్నారు.



## కాంగ్రెస్‌కు మద్దతిస్తున్న బీజేపీ..

కేంద్రంలో అధికారంలో ఉండి కూడా స్థానిక ప్రజాప్రతినిధులు ఎవరూ లేని కారణంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా శాసనమండలి ఎన్నికల నుంచి బీజేపీ అవుట్ అయింది. లోపాయికారిగా తమ చేతిలో ఉన్న కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధులను కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సూచించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ నేతలు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఒక అవగాహన కొచ్చినట్లు కనిపిస్తున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూ డా చాలా అసెంబ్లీ సెగ్మెంట్లలో బీజేపీ నేతలు కాం గ్రెస్‌కు బాహాటంగా మద్దతిచ్చారు. ప్రస్తుతం ఎంపీ టికెట్ ఆశిస్తున్న డీకే అరుణ అనుచరులు సైతం చాలామంది కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు. మరోవైపు మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో జితేందర్‌రెడ్డి వర్గం కూడా కాంగ్రెస్‌కు ఓటేయమని.. బీజేపీ ఓటమి ఖాయమని ప్రచారం చేసుకున్నారు. ఇటీవల మహబూబ్‌నగర్ మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి గద్దె దింపారు. దీంతో కాంగ్రెస్, బీజేపీలు లోపాయికారి ఒప్పందం బట్టబయలైంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా పోటీనుంచి తప్పుకొని పరోక్షంగా కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతున్నది. మహబూబ్‌నగర్ జిల్లాలో పట్టున్న బీజేపీ.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఓటమిపాలు కావడం.. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా చెప్పుకోదగ్గ ఓట్లు రాలేదు. బీజేపీ నేతలంతా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండడమే ఇందుకు కారణమని ఇరు పార్టీల కార్యకర్తలు, నాయకులు బాహాటంగా ఆరోపిస్తున్నారు.

## బీఆర్ఎస్‌కే విజయావకాశాలు మెండు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు జిల్లాలు మారాక రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని కొన్ని మండలాలను కలిపి శాసనమండలి ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 1,439 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ మేరకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు తమ తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కాగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడంతో వచ్చిన తొలి ఎన్నిక కావడంతో ఆ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికలను ఎమ్మెల్యేల భుజస్కందాలపై వేసింది. కాగా ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధులు ఇంకా బీఆర్ఎస్ వైపు ఉండడంతో గులాబీ విజయం ఖాయంగా కనిపిస్తున్నది. యువకుడు ఉత్సాహవంతుడైన మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్, షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డిని బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిపింది. దీంతో బీఆర్ఎస్‌ను గెలిపించే బాధ్యతను ఎంపీ, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలపై ఉంచారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు మున్సిపాలిటీలు మరో రెండు ఎంపీపీ స్థానాలు అధికార పార్టీ కైవసం చేసుకుంది. మిగతా చోట్ల కూడా స్థానిక ప్రజాప్రతినిధులకు ఎరవేసేందుకు ప్రయత్నించినా వారి ప్రయత్నం ఫలించలేదు. మెజారిటీ స్థానిక ప్రజాప్రతినిధులు గులాబీ దళం వైపే ఉన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు చేసేందుకు పావులు కదుపుతోంది. ప్రస్తుతం కొంతమంది పార్టీ మారినా దాదాపు 900పైచిలుకు స్థానిక ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ వైపే ఉన్నారు. మ్యాజిక్ ఫిగర్ దాటాలంటే 720 మంది మద్దతు ఉంటే చాలు. ఈ లెక్కన బీఆర్ఎస్ విజయం ఖాయంగా కనిపిస్తోంది.

# సొమ్మొకరిది.. సోకొకరిది..!

- సంగంబండ రిజర్వాయర్ నిర్వాసితులను మోసం చేసిన నాటి కాంగ్రెస్..
- రాష్ట్ర ఏర్పాటు తరువాత ప్రజల కష్టాలు తెలుసుకున్న ఉద్యమనేత
- రూ.26.35 కోట్లు విడుదల చేసిన కేసీఆర్ సర్కారు
- ఎన్నికలు రావడంతో నిలిచిన డబ్బుల పంపిణీ
- కాంగ్రెస్ సర్కారే నిధుల విడుదల చేసిందని గొప్పలు
- నేడు సంగంబండకు డిప్యూటీ సీఎం, మంత్రి రాక

మక్తల్ టౌన్, మార్చి 12 : మక్తల్ నియోజకవర్గ రైతులకు సాగునీటిని అందించాలనే లక్ష్యంతో రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం ద్వారా సంగంబండ పెద్దవాగుపై ప్రాజెక్టును నిర్మించారు. అయితే, సంగంబండ ప్రాజెక్ట్ పునరావాస నిర్వాసితులకు చెందిన మిగులు నిధుల విడుదలకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం సొమ్మొకరిది.. సోకొకరిది అన్నట్లు వ్యవహరిస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో సంగంబండ పెద్దవాగుపై రూ.2,148 కోట్లతో 3.317 టీఎంసీల సామర్థ్యం గల సంగంబండ రిజర్వాయర్‌ను నిర్మించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో సంగంబండ, ఉజ్జెల్లి, గార్లపల్లి గ్రామాల ప్రజలు తమ భూములు, ఇండ్లను సైతం కోల్పోయి పూర్తిస్థాయిలో నిర్వాసితులయ్యారు. ఈ మూడు గ్రామాల ప్రజలను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురిచేసింది. గతంలో మంత్రిగా పనిచేసిన ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి నిర్వాసితులతో అనేక దఫాలుగా చర్చలు జరిపినా.. ఇబ్బందులను తొలగించడంలో విఫలమయ్యారని నిర్వాసితులు చర్చించుకునేవారు. కాగా, ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత రిజర్వాయర్ బాధితుల కష్టాలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేశారు. నిర్వాసితులకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి రావాల్సిన బ్యాలెన్సింగ్ డబ్బులను చెల్లించాలనే ఉద్దేశంతో మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నాటి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి 24.08.2023న జీవో నెంబర్ 295 విడుదల చేయించారు. దీంతో సంగంబండ, ఉజ్జెల్లి, గార్లపల్లి గ్రామాలకు రావాల్సిన రూ.26,35,23,410 కూలి డబ్బులను కేసీఆర్ ప్రభుత్వం విడుదల చేసింది. కాగా, ఆ నిధుల పంపకం చేపట్టేలోపే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఆ తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వంలో వచ్చిన నిధులను తామే విడుదల చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే మూడు ముంపు గ్రామాలు తిరిగి చెప్పుకొంటున్నారు. అందులో భాగంగానే బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సంగంబండ పర్యటనకు పిలిపించుకొని ఆర్భాటాలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో నిర్వాసితులు లోలోపల నవ్వుకుంటున్నారు. రిజర్వాయర్ పునరావాస నిధుల విడుదలకు సంబంధించి లేనిపోని గొప్పలు చెప్పుకొంటూ సంబురాలు చేసుకోవడం కాంగ్రెస్ పార్టీ దివాళాకోరుతనానికి నిదర్శనం అని ప్రజలు బాహాటంగా చర్చించుకోవడం విశేషం.

# పేలిన బ్లాస్టింగ్ పూస

- బాలుడికి గాయాలు

లింగాల, మార్చి 12 : బ్లాస్టింగ్ పూస పేలి బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నల్లవెల్లి జయలక్ష్మి, సవారి కుమారుడైన ధనుష్ ఆరుబయట ఆడుకుంటుండగా పేలుడు పదార్థం దొరికింది. దానికి ఉన్న రెండు కొనలను కరెంట్ బోర్డులో పెట్టగా పేలుడు సంభవించింది. అయితే, కరెంట్ పోవడంతో బాలుడు గాయపడగా.. జిల్లా కేంద్రంలోని దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు డాగ్ స్క్వాడ్ సాయంతో ఇంటి పరిసరాలను తనిఖీ చేశారు.

# ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మల్దకల్, మార్చి 12 : మండలంలోని విఠలాపురం జెడ్పీహెచ్ఎస్‌లో గణితం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటేశ్‌ను అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ సస్పెండ్ చేసినట్లు హెచ్ఎం రాజేందర్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్ పాఠశాల విద్యార్థినులతో అసభ్యకరంగా వ్యవహరించడంతో మల్దకల్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ సోమవారం రాత్రి ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

# పడకేసిన పారిశుధ్యం

- మూడు నెలలుగా పంచాయతీ కార్మికులకు అందని జీతాలు
- నాలుగు రోజుల కిందట విధుల బహిష్కరణ
- నవాబ్‌పేటలో పేరుకుపోయిన చెత్త
- దుర్గంధంతో ప్రజల అవస్థలు




నవాబ్‌పేట నడిబొడ్డున పేరుకుపోయిన చెత్త

నవాబ్‌పేట, మార్చి 12 : మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని మండలకేంద్రానికి చెందిన పంచాయతీ కార్మికులు మూడు, నాలుగు రోజుల కిందట విధులు బహిష్కరించారు. దీంతో మండల కేంద్రంలోని పంచాయతీ ట్రాక్టర్ పడకేయగా.. చెత్తాచెదారం ఎక్కడికక్కడ పేరుకుపోయింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలో 124 మంది ఉండగా, మండల కేంద్రంలో 16 మంది పంచాయతీ కార్మికులున్నారు. ఇందులో సగం మంది కామాటీలు, మరికొంత మంది స్వీపర్లు ఉన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు ప్రతిరోజూ 12 గంటలపాటు విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా నూతన ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వారికి మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదు. కార్మికులు పొట్ట గడవక పనులు బహిష్కరించి, ఇతర కూలీ పనులకు వెళ్తున్నారు. దీంతో నాలుగు రోజులుగా నవాబ్‌పేట పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి చెత్త సేకరించే ట్రాక్టర్ కదలడం లేదు. గ్రామస్తులు, వ్యాపారులు చెత్తను జీపీ భవనం వద్ద పడేసి వెళ్తున్నారు. చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకపోవడంతో దుర్గంధం వస్తున్నదని ప్రజలు వాపోతున్నారు. కాగా, మిగతా గ్రామాల్లో కూడా కార్మికులకు వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చే కొద్దిపాటి జీతమైనా నెలనెలా ఇస్తే బాగుంటుందని, లేదంటే తాము కూడా విధులు బహిష్కరించాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..**

ఎంపీవో బద్రునాయక్‌ను వివరణ కోరగా.. కార్మికులకు మూడు నెలల నుంచి వేతనాలు అందని మాట వాస్తవమేనని తెలిపారు. నాలుగు రోజుల కిందట నవాబ్‌పేటలో కార్మికులు విధులు బహిష్కరించిన విషయం తనకు తెలియదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి జీతాలు అందేలా చర్యలు తీసుకుంటానని ఆయన వివరించారు.